**ఆపదలో అడ్డుపడి రక్షించిన మనిషిపట్ల కృతజ్ఞతతో హృదయం నిండిపోతుంది. చర్మం చెప్పులు కుట్టి ఇచ్చినా ఋణం తీరదనిపిస్తుంది. ఆ ఆపదలో చేయూత నిచ్చిన వ్యక్తి ఒకప్పు డెప్పుడో తనవల్ల సహాయం పొందినవాడు, పుత్రతుల్యుడూ అయితే?**

రంగి గిన్నెలు తోముతూంటే, చిరుగుల నిక్కరు వేసుకొని తల్లి పక్కనే కూర్చున్న వెంకటేశు దేనికో నస పెడుతున్నాడు.

"ఒరేయ్, వెంకటీ! పొద్దున్నే నన్ను నంపక ఇంటికెల్తావా లేదా? లేకుంటే ఈపు సాపు చేస్తాను. నా కాడ పైసాలు లేవని ఎన్నిమార్లు చెప్పాలి? ఎల్లు, మీ అయ్య నిద్ర లేచిండేమో...ఇద్దరూ కూడెట్టుకొని తినండి. పొయ్యికాడ గూట్లో అమ్మగారిచ్చిన చింతకాయపచ్చడి ఉంది. నంజుకు తినండి." తోమిన గిన్నెలు కడుగుతూ కొడుకుని కసురుకున్నది రంగి. వెంకటేశు నిరాశగా తల్లికేసి చూస్తూ ఏదో చెప్ప బోతున్నాడు. అంతట్లోకే యజమానురాలైన కామేశ్వరమ్మగారి కేక వినిపించింది, తొందరగా గిన్నెలు పట్టుమ్మని. ఆ కేకతో "తెస్తున్నా నం డమ్మగారూ" అంటూ త్వరత్వరగా తోమిన గిన్నెలు దొంతరగా పేర్చి పట్టుకొని ఇంట్లోకి వెళ్లింది రంగి. తల్లి వెనకాలే పిల్లిలా నడుచుకుంటూ వెళ్లాడు వెంకటేశు.

గిన్నెల కోసం అక్కడకు వచ్చిన కామేశ్వరమ్మగారు వెంకటేశుని చూచి, "ఇవాళ పొద్దున్నే నీ వెనకాల వచ్చాడేమే వీడూ?" అని అడిగింది. రంగి కొడుకు కేసి చూస్తూ చిన్నగా నవ్వుకొని, "ఈడు సదువు సటిగి గైనేర్తై, నన్నుద్దరిస్తాడం టమ్మగారూ ... ఈడికి పలకా బలపం కావాలంట...నా పేణం తీస్తున్నాడు రేత్రినుండి. నా కాడ డబ్బులు లేవురా అంటే ఇనుకో కుండా నా ఎనకాల పడిండు. తిండికి నేక కటకటపడు తుంటే అద్దురూపాయి ఎట్టి ఈడి కోసం పలకెక్కడ కొనగల్ను, సెప్పండమ్మగారూ" అంటూ జాలిగా యజమానురాలికేసి చూసింది రంగి.

ఒకవైపు భర్తకి ఆఫీసు టైము, మరోవైపు పిల్లలను స్కూలుకు పంపే తొందర, అటు పాలవాడు, ఇటు మార్కెట్టుకి వెళ్లడానికి పంచి పట్టుకు రెడీగా నిలుచున్న ప్యూను. నాలుగు వైపులా ఊపిరి తిప్పడానికి అవకాశంలేని హడావిడిలో ఉన్న ఆ సంపన్న గృహిణికి ఒక నిరుపేదరాలు—తన ఇంటి పరిచారిక—చెప్పుకుంటున్న కడుపుబాధ గాథ వినడానికి అవకాశం ఎక్కడిది? దాని బిడ్డ కోరిక జాలితో విని, సానుభూతితో సహాయం చేసే సమయం ఎక్కడిది? తోమిన గిన్నెలు అటూ ఇటూ చూసి, "ఏమిటే, రంగీ! బొత్తిగా పనిమీద శ్రద్ధ లేకుండా ఉంది. ఈ గిన్నె అంతా అంటే, ఇదిగో ఈ కళాయి చూడు—జిడ్డూ పసుపూను. ఐదు రూపాయలు తీసుకుంటున్నావు...ఇలాగేనా చెయ్యడం పని? తీసుకు పోయి మళ్లీ శుభ్రంగా తోమి పట్రా!...పాడు నౌకర్లు, పాడు పనులూను." ఆ రెండు గిన్నెలూ రంగిమీద గిరాటేసి, రుసరుసలాడుతూ తనకు కావలసిన గిన్నె తీసుకుని వంటింట్లోకి వెళ్లిపోయింది కామేశ్వరమ్మ. రంగి దీర్ఘంగా నిట్టూర్చి, నిర్లిప్తంగా నిలుచున్న కొడుకు కేసి చూసింది. ఒక్కుమ్మడిగా వాడిమీద కోపం ముంచుకు వచ్చింది. అక్కడున్న చింకి చీపురు తీసుకుని, "సచ్చినోడా!. . . నీ మూలంగానే ఈయాల ఇన్ని మాటలు పడవలిసివచ్చింది" అని కసిదీరా రెండు తగిలించి, "ఎల్లు. . . ఎలతావా నేదా?" అని రెక్క పట్టి ఈడ్చి, పెరటి తలుపు తీసి అవతలకి నెట్టి, తలుపు వేసేసింది రంగి.

* * *

బుడ్డిదీపం ఆర్పి, కొడుకు పక్కలో ఒరిగిన రంగి చెవులకు ఎదురింటి మాష్టరమ్మగారి గడియారం ఎనిమిది గంటలు కొట్టడం వినిపించింది. కోడికూత వేళకి లేచి సూర్యుడు భూమిలోకి కుంగే వరకు, ఒళ్లు పులిసిపోయేవరకు పనిచేసి ఇంటికి వస్తుంది రంగి. చాకిరీ చేస్తున్న ఇండ్లల్లోని ఏ అమ్మా పట్టెడన్నం పెడితే మూట కట్టుకువచ్చి ముగ్గురు పంచుకు తింటారు.

రంగి మొగుడు అవిటివాడు. పని చేయలేడు. పొలాల గట్టుమీద ఉన్న గడ్డి కోసుకు వచ్చి అమ్మి, అర్థో పర్థో తెస్తాడు. లేనినాడు లేదు. వెంకటేశు ఒక్కడే కొడుకు. పెళ్లయిన పదేళ్లకు పుట్టాడు వెంకటేశు. పుట్టిన సంవత్సరమే తండ్రి గురవయ్యకి పక్షవాతం వచ్చి కాలు వంకరపోయింది. వెంకటేశుకి ఎనిమిది వెళ్లి తొమ్మిదో ఏడు వచ్చింది. తల్లితండ్రులకు వాడు వరప్రసాదిలాంటి వాడు. కాని, వాడి ముద్దుముచ్చటలు తీర్చడానికిగాని, కనీసం కడుపునిండా అన్నం పెట్టడానికి గాని నోచుకోని కటిక దరిద్రులు. అయితే పేద ఇంట పుట్టిన వెంకటేశుకి తినడానికి కూడు లేకపోయినా తల్లితండ్రుల మమతా వాత్సల్యాలనే అమృతం సమృద్ధిగా లభించుతూండడంవల్ల ఏ లోటూ లేనివాడుగా కని పిస్తాడు. కట్టెపుల్లలూ, పేడకళ్లలూ ఏరుకు రావడానికి పంపరు ఆ తల్లితండ్రులు—తమ బిడ్డను. కష్టపెట్టి హింసించడం ఇష్టం లేదు. అందుకే వెంకటేశుకి ఏమీ తోచేది కాదు.

ఒక రోజు తోటికుర్రాళ్లతో గోటీ బిళ్ల ఆడుతూ ఉండగా ఆ గోటీబిళ్ల పోయి, నాలుగిళ్ల అవతల ఉన్న కామశాస్త్రిగారి ఇంటి ముంగిట పడింది. దానిని తెచ్చుకో డానికి వెళ్లిన వెంకటేశుని, శాస్త్రులుగారి ఇంట్లో జరుగుతున్న పురాణ కాలక్షేపం మంత్రం వేసి కట్టేసింది. ఆ నాటినుండీ వెంకటేశు ఆటపాటలకు స్వస్తి చెప్పి, రోజూ పురాణ కాలక్షేపానికి హాజరు కాసాగాడు. గుమ్మంలో కూర్చొని శ్రోతలతోపాటు రెప్ప వాల్చకుండా, చెవులు దొరపెట్టుకొని వింటూ పూర్తి అయినాక వచ్చేస్తుండే వాడు. శాస్త్రులుగారు అర్థం విడమరిచి చెబుతూంటే అన్నీ ఆకళింపు చేసుకుంటూండేవాడు. రోజూ క్రమం తప్పకుండా పురాణానికి హాజరవుతూ శ్రద్ధగా వింటున్న వెంకటేశుని గమనించిన శాస్త్రులుగారు ఒక రోజు, "ఏరా, వెంకటీ, నీకు తెలుస్తుందిరా పురాణం?" అని అడిగారు.

"ఓ!. . . ఆ ఏకలవ్యుడు బలే పనిచేశాడు కదండీ! బొమ్మని ఎదటెట్టుకొని ఎంత ఇద్య నేర్చిండు! పాపం, ఆ డేలు ఆ ముసిలిబాపనయ్య కోసేసినాడు. నాకు బలే ఏడుపొచ్చిం దయ్యగారూ! అయ్యగారూ! గురుదక్షిణంటే అర్థం ఏటండీ?" అని అడిగాడు తెలుసుకుందామనే కుతూహలంతో, శాస్త్రులుగారికేసి చూస్తూ వెంకటేశు. వాని తెలివి, ఆ ఉత్సాహం చూచి కామశాస్త్రిగారు ముచ్చటపడి చిన్నగా నవ్వుతూ, "గురుదక్షిణంటే ఎవరి దగ్గర చదువు నేర్చు కుంటే ఆ గురువుగారికి బహుమానం ఇవ్వడం అన్న మాట. దానికే గురుదక్షిణ అంటారు. తెలిసిందా?" అంటూ వాడి భుజంమీద మెల్లిగా తట్టి, "నువ్వు చదువు నేర్చుకో. అన్నీ చక్కగా చదివి తెలుసుకోగలవు" అన్నారు హితబోధ చేస్తున్న ధోరణిలో శాస్త్రులుగారు. అంతే, ఆ శాస్త్రులుగారి ఉపదేశ వాక్యాలు వాడి బుర్రలో పురుగు దొలిచినట్టు దొలవడం ప్రారంభించాయి. దాని ఫలితమే పలకా బలపం కావాలని తల్లి దగ్గర నస పెట్టడం, తత్ఫలితంగా దెబ్బలు తినడమూను.

* * *

పొద్దుట కొట్టిన దెబ్బలు గుర్తుకి వచ్చాయి రంగికి. కొడుకు వీపు తడిమి చూసింది.

"అబ్బా!" అన్నాడు వెంకటేశు బాధగా. రంగి కంగారుగా లేచి బుడ్డిదీపం తీసుకువచ్చి చిరుగుల చొక్కా ఎత్తి చూసింది. చెత్తెడుమేర ఎర్రగా అట్టుతేరి ఉంది. అక్కడక్కడ చిన్న చిన్న తట్లు ఉన్నాయి. రంగి కళ్లలో నీళ్లు గిర్రున తిరిగాయి.


"నా పాడు చేతులు పడిపోనూ, నా బాబునెంతలేసి దెబ్బలు కొట్టేసినాన్రా, దేముడా!" అనుకుంటూ కొడుకును అక్కున చేర్చుకొని వలవలా ఏడ్చింది రంగి.

"అమ్మా!" అన్నాడు చల్లస్వంలో ఉల్లిపాయ నంజుకుంటూ వెంకటేశు. పొయ్యిలోకి ఎండుటాకులు తోస్తూ కొడుకు కేసి చూసి, "ఏందిరా, ఏం కావాలి?" అని అడిగింది రంగి.


"అమ్మా! మరే, నేను సదువుకుంటానే. బెరుగ్గా అడిగాడు దెబ్బలు గుర్తు చేసుకుంటూ,

చెరువునుంచి ...

చిత్రం— వెంకటగిరిరాజు (మెదక్ (ఆ.ప్ర.)



# గురుదక్షిణ



-రామసోదరి

కొడుకు మాటలకు రంగికి జాలీ, కోపం వచ్చాయి.

"ఒరే, నీకు ఎన్ని మార్లు చెప్పానురా... మన దగ్గిర డబ్బు లేదూ, ఆ సదువులు గొప్పోరికేగాని మనలాటి పేదోరికి పనికిరావని? ఆ ఊసు మరి ఎత్తబోకు, తెలిసిందా?" కాస్త కటువుగానే అంది కొడుకు కేసి చూస్తూ రంగి.

"అదికాదే, అమ్మా! ఆ కామసాత్తుర్లకాడ నేర్చుకుంటానే, ఆరికెల్లి నువ్వడుగు." బతిమాలే ధోరణిలో మెల్లిగా అన్నాడు.

"ఛీ! సచ్చినోడా... డబ్బియ్యకపోతే ఆ సాత్తుర్లు నీకు సదువు సెప్తాడ్రా? నీకు బుద్ధి లేదు... నేను ఇక్కణ్ణించి." కసురుకున్నది రంగి.

వెంకటేశు అయిదు నిమిషాలు ఊరుకున్నాడు. పొయ్యిమీద కుండలో పోసిన బియ్యం మెత్తబడి, అన్నం రూపంలోకి మారుతూ కుతకుత శబ్దం చేస్తున్నవి. రాళ్ళలాంటి బియ్యాన్ని తన శక్తిసామర్థ్యాలతో మెత్తగా చెయ్యాలనే దృఢసంకల్పంతోద్దీ అగ్నిదేవుడు విజృంభించి భగభగ మంటలతో కార్యసిద్ధి పొందుతున్నాడు. అది చూస్తున్న వెంకటేశులో తన ఇబ్బందుల నెగ్గించుకోవాలనే సంకల్పం దృఢమవసాగింది. వాడి మెదడులో ఒక ఆలోచన తళుక్కున మెరిసింది.

"అమ్మా!" అన్నాడు దీనస్వరంతో. తెడ్డుతో అన్నం కలుపుతున్న రంగి కొడుకు పిలుపు విని సర్రున వెనుతిరిగి, "ఏమిట్రా, నీ ఆగడం? మంచిగా సెప్తే ఇనుకోవేవ్... మళ్ళీ కావాలా దరువులా?" అని కోపంతో గుడ్లురిమి చూసింది. తల్లి కోపం చూసి భయమేసినా ధైర్యం తెచ్చుకున్నాడు వెంకటేశు.

"అదికాదే, నేను ఆ శాత్తుర్లుగోరింట్లో పని సేత్తాను. ఆరు నాకు జీతం ఇవ్వకుండా దాని బదులు పదువు సెప్తారు" అన్నాడు ఆగి తల్లికేసి చూస్తూ వెంకటేశు.

కొడుకు మాటలు విన్న రంగి డంగైపోయింది. లిప్తకాలం కొడుకు కేసి చూస్తూ ఉండిపోయింది.

"ఓరి నా కొడకా! నీ కెన్ని ఆలోసెనల్రా? నీ బుర్ర మా గొప్ప బుర్రేరా" అంటూ కొడుకుని మోటుగా పొగిడి, "సర్లే, అలాగే ఆ సాత్తుర్లుబాబు నడుగుతాను. ఇంక నెగు గిన్నెకాడనించి" అంటూ అన్నం వార్చడంలో మునిగిపోయింది రంగి.

• • •

కళ్ళజోడు తీసి రంగికేసి వింతగా చూశారు శాస్త్రిగారు.

"ఏమే, రంగీ! పొద్దున్నే ఇలా వచ్చావ్? అరే! వెంకటేశుకూడా వచ్చాడే. . . ఏరా! మీ అమ్మను వెంటేసుకొచ్చావ్? ఏమిటి విశేషం?" అంటూ ప్రశ్నార్థకంగా చూశారు ఆ తల్లీకొడుకుల కేసి శాస్త్రిగారు.

"బాబుగారూ. . .ఈడిని మీ పాదాలకాడ పడేయ డానికి వచ్చాను."

"అదేమిటే. . . నా పాదాలకాడ పడేయడం ఏమిటే. . .?" విస్తుపోయారు శాస్త్రిగారు.


"ఔను, బాబుగారూ. ఈడు సదువుకుంటానని నా పేణాలు తోడేస్తున్నాడు. ఈడు మీ ఇంటి శాకిరీ అంతా సేత్తాడు. డబ్బు నా కొద్దం డయ్యగారూ! ఈడికి అచ్చరం ముక్కలు నేరిపించండి. అంతే సాలు. ఈడు మీతో అనాగ సెప్పమని లాక్కొచ్చిండు నన్ను."

రంగి మాటలు వింటున్న శాస్త్రిగారు ఆశ్చర్య పోయారు. ఒక నిరుపేదల ఇంట పుట్టిన వెంకటేశులో చదువుమీద ఇంత కాంక్ష, అచంచలమైన పట్టుదల చూస్తుంటే వింతనిపించింది. ఆయన హృదయం దయా సానుభూతులతో పులకించింది. వాత్సల్యంగా వెంకటేశు కేసి చూస్తూ, "అట్లానే, రంగీ! వాణ్ణి ఇక్కడ ఉంచిపో" అన్నారు అభయమిస్తున్నట్లుగా శాస్త్రిగారు.

"ఎల్లురా, బాబుగోరి పాదాలకి మొక్కు! నీ పున్యం పుచ్చింది" అంటూ కొడుకుని ముందుకు నెట్టింది. వెంకటేశు శాస్త్రులుగారి పాదాలకి తన చేతులు తాకించి కళ్ళ కద్దుకున్నాడు భక్తిగా. శాస్త్రులుగారు చిరునవ్వు నవ్వుతూ, "మనోభీష్ట సిద్ధిరస్తు" అంటూ దీవించారు. "ఎల్లొస్తాను, బాబుగోరూ, ఆడి భారం మీ మీద ఎట్టాను" అంటూ తానుకూడా శాస్త్రిగారి పాదాలకి మొక్కి వెళ్లిపోయింది రంగి.

• • •

ఆరు మాసాలయింది. ఓనమాలతో ప్రారంభించిన వెంకటేశు చదువు ఆరో తరగతి పుస్తకం చదవగలిగే వరకూ వచ్చింది. శాస్త్రిగారింట్లో వారి పనులన్నీ భయభక్తులతో చేస్తూ, శాస్త్రిగారు చెబుతున్న పాఠాలు ఎంతో శ్రద్ధాసక్తులతో నేర్చుకుంటున్నాడు. వాని వినయవిధేయత, చదువునందు వాడు చూపే ఆసక్తి, తెలివితేటలు చూస్తున్న శాస్త్రిగారికి వాని పట్ల రోజురోజుకీ అభిమానం, అనురాగం పెరగ



రేఖాచిత్రం

సాగింది. దానితో ఆయన ఆలోచనలు కాస్త ముందుకు సాగాయి. హైస్కూల్లో హెడ్‌మాస్టరుగా ఉంటున్న ముకుందంగారితో మాట్లాడి వాడిని ఫస్టుఫారంలో జాయిన్ చేయించారు, జీతబత్యాల భారం తన భుజాల మీద వేసుకొని. హైస్కూలు ప్రవేశంనాడు వెంకటేశు శరీరం ఆనందంతో ఉప్పొంగిపోయింది. శాస్త్రిగారి పాదాలమీద పడి తన కృతజ్ఞతాశ్రువులతో కడిగేశాడు వెంకటేశు. వెంకటేశు బదులు రంగే శాస్త్రులుగారి ఇంట్లో పనులన్నీ చక్కపెడుతుంది, తన కొడుక్కి అయ్యే ఖర్చు వారికి గిట్టుబాటు అయేటందుకు. రోజులు వారాలు, వారాలు నెలలవగా సంవత్సరాలుకూడా దాటాయి. వెంకటేశు స్కూల్‌ఫైనల్ పాసయాడు.

• • •

బరంపురంలో వకీలు విశ్వనాథంగారి దగ్గర గుమాస్తాగా ఉంటున్న వెంకటేశు శాస్త్రిగారి కుమార్తె రాధ వివాహ పత్రిక అందుకున్నాడు. వెంకటేశు ఆనందోత్సాహాలకు మేర లేకపోయింది. శుభలేఖతోపాటు ఉత్తరంకూడా వ్రాశారు శాస్త్రిగారు తప్పకుండా వివాహానికి రమ్మనమని. వారం రోజులు వకీలుగారి దగ్గర సెలవు తీసుకుని నాలుగు రోజులు ముందుగానే వచ్చాడు వెంకటేశు. వెంకటేశుని చూచి శాస్త్రిగారి కుటుంబం ఎంతో ఆనందించారు. తమ ఆప్తుడెవరో వచ్చినంత సంబరపడ్డారు. రంగి కొడుకుని చూచుకొని మురిసిపోయింది. ఆ ఆనందం పంచుకోడానికి తన మామ లేనందుకు దుఃఖించింది. శాస్త్రిగారి పిల్లలకు బహుమతులూ, తల్లికి రెండు చీరలూ తీసుకువచ్చాడు వెంకటేశు. అవి చూసుకొని కొడుకుని కౌగిలించుకొని ఆనందబాష్పాలు విడిచింది రంగి.



"ఇదంతా ఆ సాత్తుర్లుగారి సలవ. సందె దీపం పెట్టి, ఆరిని రోజూ తలుసుకొని దణ్ణం పెట్టాలి." ఆమె కళ్ళు కృతజ్ఞతతో మిలమిలలాడాయి.

వెంకటేశు శాస్త్రిగారికి పెళ్లిపనుల్లో చాలా సహాయం చేస్తున్నాడు. పందిరి అలంకరించడం దగ్గిర నుంచి బంధువులకు కావలిసిన అవసరాలు తీర్చడం వరకు అన్ని పనుల్లో తానై తిరుగుతున్నాడు.

పెండ్లి ముహూర్తం సమీపించింది. మేళతాళాలతో, బాజాభజంత్రీలతో పెళ్లివారిల్లు మారు మోగుతూంది. పెళ్లివారంతా వన్నె వన్నె వస్త్రాలు ధరించి, చూచేవారి కన్నులు తమమీద లగ్నం అయే టట్లు అతి హడావిడిగా తిరుగుతున్నారు. వధూవరులు పీటలమీద కూర్చున్నారు. శాస్త్రిగారి దంపతులు వరుని కాళ్ళు కడగడానికి ఉపక్రమించబోతుండగా, "ఆగండి! ముందు కట్నం చదివించాలి" అన్నారు పెళ్లికుమారుని తరఫువారు. శాస్త్రిగారు వెంటనే తమ దగ్గిరే ఉంచుకున్న డబ్బు తీసి వరుని తండ్రి చేతిలో పెట్టారు. వరుని మేనమామ వాటిని లెక్కించి రెండువేల ఆరువందలని చెప్పాడు.

"అదేం!. . . తక్కిన నాలుగువందలో?" ... పెళ్లి కుమారుని తండ్రి ఆశ్చర్యంతోపాటు కోపంకూడా మేళ వించి చిన్న కేకలాంటిది వేశాడు. పందిట్లో ఉన్నవారంతా ఆ మాటలు విని ముఖముఖాలు చూచుకున్నారు. వియ్యపురాలు తన బంగారపు గాజులు తళుక్కుమనగా చేతులతో బుగ్గలు నొక్కుకుంటూ, "ఈ విడ్డూరం మరీ బాగుంది. ఆ నాలుగు వందలూ బాకీ పెట్టాలని చూస్తున్నట్లున్నది. అదేమీ వీలులేదు. ఆ నాలుగు వందలూ అక్కడ పెట్టాకే అబ్బాయి పిల్ల మెళ్లో పుస్తె కట్టేది" అంటూ సాగదీసింది.

భార్యా విధేయుడైన వియ్యంకుడు దానికి బవాబు ఏమిస్తారన్నట్లు ప్రశ్నార్థకంగా చూస్తూ, "బావగారూ. . . తక్కిన డబ్బుకూడా తీసుకువచ్చి ఇస్తేగాని పెళ్లి జరగడానికి వీలులేదు." అని కచ్చితంగా చెప్పేసరికి శాస్త్రులుగారి నడుం జారిపోయింది. ధైర్యం చేజిక్కించుకొని ప్రార్థనాపూర్వకంగా వియ్యం కుని కేసి చూస్తూ, "మీరు నా పరువు నిలపాలి. కొద్ది రోజుల్లో మీ మిగతా డబ్బు ఇచ్చేస్తాను. పెళ్లి నిలిపివేయడం భావ్యం కాదు. ఎంత కాళ్లు అరిగేటట్లు తిరిగినా డబ్బు ఎక్కడా సర్దుబాటు కాలేదు. ముందుగా మీ తోటి మనవి చేయడానికి నాకు అవకాశం చిక్క లేదు. డబ్బు విషయంలో ఏమీ భయపడవద్దు. మీ డబ్బు పువ్వుల్లో పెట్టి మీకు సమర్పించుకుంటాను." ప్రాధేయతతోకూడిన కంఠంతో వియ్యంకుని చేతులు పట్టుకున్నారు శాస్త్రులుగారు.

"ఇది మరీ బాగుంది. . . కట్నం ఇవ్వకుండానే కుమార్తె కల్యాణం చేసేద్దామనుకుంటున్నారు గామాలు! అదేమీ సాగదు. . . లేరా, అబ్బాయ్! పదం పోదాం." విసురుగా వచ్చి వియ్యపురాలు కొడుకు జబ్బ పుచ్చుకొని లేవదీయబోయింది.

"మీ ఇబ్బందులు మాతో చెప్పుకుంటే ఏం లాభం అండీ? మాకు కావలిసింది కట్నం. అది ఇవ్వలేకపోతే మేము తిరిగి వెళ్లిపోవడం తప్పదు." పెళ్లికుమారుని అన్నగారు రంగంలోకి దూకి పెద్దరికం ఒలకపోశాడు.

వాయిదా చెల్లుబడుల మీద
ట్రాన్సిస్టర్

బజా
( గ్యారంటీతో )
3 బాండ్ల అఖిల ప్రపంచ పోర్టబుల్ ట్రాన్సిస్టర్ రు. 5/- ల నెలసరి వాయిదాలమీద. ప్రతి పత్రికకు, ఒక కానుకకి సంపాదించును. వివరములకు:
HIND AGENCIES (55)
Kolhapur Road, Delhi-7.

ఇండియాలో మొట్టమొదటిసారిగా

35 మిమీ. హోంసినీప్రొజెక్టర్‌తో మీ ఇంటిలోనే అసలు సినిమా చూచి ఆనందించండి. సాధారణ గదిలో తెరమీద మాకిష్టమైన చలనచిత్రాలను టార్చితో గాని ఎలక్ట్రిసిటీతో గాని చూడవచ్చును. చిత్రాలు మీరు సినిమా హాలులో చూచునట్లే వింత పైజాన కదులుతాయి, నటిస్తాయి, నాట్యంచేస్తాయి. స్పెషల్ క్వాలిటీ రు. 40/-లు. ఒక అసలు ఫిలిం ఉచితం. అదనపు ఫిలిం మీటరు రు. 1/—.
ROLEX INDIA (A.P.V.-44)
P. Box 1574, Delhi-6.

శాస్త్రిగారు నిస్సహాయతతో అక్కడున్న పెద్దమనుషుల కేసి చూశారు.

ఆ దృశ్యం చూసిన వెంకటేశు హృదయం జాలితో ద్రవించిపోయింది. కళ్ళవెంట నీళ్ళు టపటపా వచ్చాయి. కాని. . . తను మాత్రం ఏం చేయగలడు, పెళ్ళివారి మీద పటపటా పళ్ళు నూరడం తప్ప? ఎలాగున్నా తేనేం పెద్దలంతా చేరి సంవత్సరం లోపుగా వారి డబ్బు ఇచ్చి వేయడానికీ, అంతవరకూ పిల్ల పుట్టింట్లోనే ఉండడానికీ నిర్ణయం చేసి పెళ్ళి అయికుండా జరిపించేశారు. ఈ సంఘటనతో శాస్త్రిగారి హృదయం గాయపడింది. ఆయన వదనం విచారంతో కళావిహీనమయింది.

కుమార్తెకు వివాహం అయిందనే ఆనందం ఆవంతన్నా లేకపోయింది. వచ్చిన బంధువులంతా వెళ్ళిపోయారు. పెళ్ళికని సంతోషానందాలతో వచ్చిన వెంకటేశు గురువుగారి పరిస్థితికి ఎంతగానో విచారించాడు. సెలవు అయిపోవడంవల్ల తనుకూడా ప్రయాణమై వెళ్ళిపోయాడు.

శాస్త్రిగారు బాగా దిగజారిపోయారు. అప్పటికే కుమార్తె పెళ్ళికని మూడు వేలు అప్పుచేశారు. అది చాలక ఇల్లు తాకట్టు పెట్టవలసి వచ్చింది. సామాన్య కుటుంబీకులైన శాస్త్రిగారు ఈ ఋణం తీర్చడం ఎలా అని ఆలోచిస్తుంటే, అప్పట్లో ఆయనకి అప్పు ఎవరిస్తారు? 'ఒక్కగాని ఒక్క కుమార్తె ముచ్చటగా కాపరం చేసుకోకుండా తన దురదృష్టానికి కుందుతూ పుట్టింట పడి ఉండవలసి వచ్చిందే' అని దుఃఖించసాగారు. ఏది ఎలా జరిగినా గతి తప్పని కాలచక్రం తన గమనంతో రోజు తరవాత రోజును నెట్టుకుంటూ ముందుకు సాగిపోతూనే ఉన్నది. ఆరు అమావాస్యలు అంధకారం విరజిమ్ముతూ ఆశలే అంధకారంలో కొట్టుకుంటున్న అనాథులను మరీ కాస్త హడలు కొడుతూ వెళ్ళిపోయాయి. శాస్త్రిగారికి బుద్ధి తోచడం లేదు. బిడ్డ ముఖం చూడలేక తల వంచుకొని తిరుగుతున్నారు. ఆరు నెలలైనప్పటికీ అరవంతైనా ఇంత పెట్టలేకపోయారు.

ఆ రోజు పొద్దున్నే లేచి కాలకృత్యాలు తీర్చుకుని కాఫీ తాగి, భగవద్గీతా పారాయణం చేసుకోడానికి కూర్చున్నారు. ఎంత ప్రయత్నించినా ఆయన మనస్సు అందులో లగ్నం చెయ్యలేకపోతున్నారు.

పుస్తకం మూసి శూన్యంలోకి చూస్తూ ఉండిపోయారు.

"అయ్యగారూ! మీకుఉత్తరంవచ్చింది." పోస్టుమేన్ కేకతో ఉలిక్కిపడ్డారు శాస్త్రిగారు. గబగబా వచ్చి ఉత్తరం అందుకున్నారు. ముద్రపట్టి వియ్యాలవారి దగ్గరనుండి వచ్చిందని తెలుసుకొని గుండె దడదడలాడగా కవరు విప్పి చదువుకున్నారు.

"మహారాజశ్రీ బావగారికి నమస్కరించి వ్రాయునది. ఉభయకుశలోపరి. మీరు మీ శిష్యుడైన వెంకటేశు ద్వారా పంపిన నాలుగు వందలూ అందినవి. చాలా సంతోషమైనది. మీకు ఇంతకాలం శ్రమ ఇచ్చినందుకు క్షమించవలెను. మంచి రోజు చూసుకొని మా కోడలును తీసుకువచ్చేటందుకు అక్కడికి వచ్చెదము. ఇంతే సంగతులు. మీకు నా నమస్కారములు.

ఇట్లు,
మీ బావగారు
—భ. రంగనాథం,"

"వెంకటేశు ... వెంకటేశు ... శాస్త్రిగారి నోటి నుండి అప్రయత్నంగా రెండు మార్లు వెలువడింది, వెంకటేశు పేరు. ఆయనలో వెంకటేశుపట్ల వాత్సల్యమో, అభిమానమో, కృతజ్ఞతో ఇదమిత్థమని తెలియని అనుభూతి కలిగి వివశులుని చేసింది. కనుకొలకుల్లో నీళ్ళు ఉబికి నిలవలేక రాలిపోయాయి. అంతరాంతరాలలో ఎవరో 'గురుదక్షిణ' అన్నట్లు అనిపించింది. ఏనాటి మాటో గుర్తుకి వచ్చి శాస్త్రిగారు ఆశ్చర్యంతో నిశ్చేష్టులయ్యారు. ★

**పత్రికా రచయిత**

రచయిత అనిపించుకోవడం కన్న పత్రికా రచయిత అనిపించుకోవడమే నా కిష్టం. కారణం, పత్రికా రచయిత నిత్యయాత్రికుడు.

—గిల్బర్ట్ కె. చెస్టర్టన్

**నవ్వు**

బిగ్గరగా నవ్విన నవ్వు శూన్య మనస్సుకు ప్రతీక.

—గోల్డ్‌స్మిత్

మంచి నవ్వు ఇంటికి వెలుగునిస్తుంది.

—థాకరే


అందమైన మీ కేశములకు శ్రద్ధ
పోషణ అవసరం
బెంగాల్ కెమికల్ వారి
కాంతరిడైన్
హెయిరాయిల్
నిడుపాటి నిగనిగలాడే పట్టు వంటి మెత్తటి కురులను పెంచుటకు తోడ్పడుతుంది. జుట్టును జిడ్డు పట్టకుండా ఉంచుతుంది. జుట్టు రాలి పోవటాన్ని నివారిస్తుంది.
బెంగాల్ కెమికల్
కలకత్తా బొంబాయి
కాన్పూరు ఢిల్లీ